## మానవుడు అమృతపుత్రుడు

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావముకంటె మాన్యమెద్ది?
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భారతపాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఱుగలేదొ
అట్టులైనారు మన భారతీయులు నేడు

*ప్రేమస్వరూపులారా!* భారతదేశ విశిష్టతను, దీనియొక్క గొప్పతనమును, పవిత్రతను ఎవ్వరూ చవిచూడడానికి ప్రయత్నించడం లేదు. అన్ని సంస్కృతులకంటే భారతీయ సంస్కృతి ఉత్తమ మైనది, చాలా పవిత్రమైనది. ఈ సంస్కృతి అణువునుండి ఘనమువరకు సర్వత్రా వ్యాపించి యున్న దివ్యత్వాన్ని దర్శింపజేస్తుంది. కాని, ఇట్టి పవిత్ర సంస్కృతిని ఈనాడు భారతీయులే విస్మరించి పరదేశ సంస్కృతులను అనుసరిస్తూ కాలమును వ్యర్థం చేసుకుంటున్నారు. భారతీయ సంస్కృతికి మూలాధార మైనవి సత్యధర్మములు. ఈనాడు సత్యధర్మములు రెండూ సమసిపోయినాయని అంటున్నారు. ఇది చాలా పొరపాటు. ఇవి ఆచరణలో లేకపోవడంవలన కొంత వరకు మరుగునపడినాయని చెప్పవచ్చును. అంతేగాని, వీటిని నిర్మూలించడం ఎవరి తరమూ కాదు.

### ఎవరు నిజమైన భారతీయులు?

సత్యధర్మములు రెండూ మానవునికి రెండు నేత్రములవంటివి. కాని, వీటిని కోల్పోయి మానవుడు అంధుడవుతున్నాడు. ఈనాటి విద్యార్థులు ఎన్ని చదువులు చదివినప్పటికీ, ఎన్ని డిగ్రీలు పొందినప్పటికీ సత్యధర్మములంటే ఏమిటో వారికి అర్థం కావడం లేదు. అనాదికాలమునుండి సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను అనుసరిస్తూ రావడంవలననే భారతదేశం ఆధ్యాత్మిక రంగములో యావత్ప్రపంచానికి నాయకత్వము వహించింది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను పోషించు కున్నప్పుడే మనము నిజమైన భారతీయులమవుతాము. ఇందులో ఏ ఒక్కటి తప్పిపోయిననూ మనము భారతీయులమే కాదు. భారతీయులకు త్యాగము ప్రధానమైనది. త్యాగమనగా సర్వసంగపరిత్యాగము చేసి అడవులకేగడం కాదు. సత్యధర్మములను అనుసరిస్తూ జీవితాన్ని గడపడమే నిజమైన త్యాగము. సత్య ధర్మములననుసరిస్తూ శాంతి, ప్రేమలకు ప్రయాణము సల్పాలి. జననిగర్భమునుండి జన్మించినది మొదలుకొని మానవుణ్ణి సత్యధర్మములే పోషించుచున్నవి. సత్య ధర్మములే ఈ జగత్తునకు ఆధారముగా నిలిచినవి. ప్రాచీనకాలంలో భారతీయ స్త్రీలు అనేక కష్టములకు ఓర్చి సత్యధర్మములను కాపాడుతూ వచ్చారు. ఒకవైపున తమ ఇంటిపనులన్నీ తామే చూసుకుంటూ, మరొక వైపున తమ బిడ్డలకు సద్బోధలు సలుపుతూ వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దుతూ వచ్చారు.

### సత్యధర్మముల సారమును గుర్తిస్తే చాలు!

ముఖ్యంగా ఈనాటి విద్యార్థులు నేర్చుకోవలసింది ఏమిటి? గొప్ప విద్యలు కాదు, గొప్ప డిగ్రీలు కాదు. సత్యము, ధర్మము – ఈ రెండింటియొక్క సారమును గుర్తించుకుంటే చాలు! ఈనాటి మానవునికి సత్యమంటే ఏమిటో, ధర్మమంటే ఏమిటో తెలియడం లేదు. ధర్మ మనగా 'డ్యూటీ' అనుకుంటున్నారు. కాని, 'డ్యూటీ' అనే ఆంగ్లపదము ధర్మముయొక్క పరిపూర్ణమైన స్వరూపానికి సంబంధించినది కాదు. 'ధారయతీతి ధర్మః' అన్నారు. ధరించినది ధర్మము. మన ధర్మమును మనం కాపాడుకోవడం అత్యవసరం. ధర్మమును విస్మరించినవారు అవమానాలకు గురికాక తప్పదు. ఇంక, సత్యమనగా ఏమిటి? పవిత్రమైన హృదయ నాభినుండి

ఏర్పడినటువంటిది సత్యము. స – అనగా సాత్వికము; త్య – అనగా త్యాగము. ఈ రెండింటితో కూడినది సత్యము. అంతేకాదు. 'సత్య' అనే పదములో 'స, త, య' అనే మూడక్షరాలున్నవి. వీటిని త్రిప్పి చదివితే – 'య, త, స' అవుతుంది. దీని అంతరార్థ మేమిటి? యమనియమాదులచేత తపస్సు ఆచరించి నప్పుడు సత్యస్వరూపుడు సాక్షాత్కరిస్తాడు. సత్యమునకు ఎంతటి ఘనత ఉంటున్నదో దీనిని బట్టి మీరు యోచించుకోవచ్చును. అలనాడు పంచపాండవులు, ద్రౌపది సత్యధర్మాలను అనుసరించడంచేతనే శ్రీకృష్ణుని అనుగ్రహానికి పాత్రులు కాగలిగారు.

**దైవానుగ్రహముచేత నొసటివ్రాతను మార్చుకోవచ్చు**

కేవలం పదహారు సంవత్సరాల ఆయుష్షు కలిగిన మార్కండేయుడు తన భక్తిప్రపత్తులచేత ఈశ్వరుని అనుగ్రహానికి పాత్రుడై చిరంజీవి అయినాడు. నొసటివ్రాతను మార్చడమనేది ఒక వ్యక్తివలన జరిగే పని కాదు; ఒక్క దైవశక్తిచేతనే అది సాధ్యమవుతుంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగిని 'మేము రక్షిస్తామ'ని డాక్టర్లు ప్రామిస్ చేయవచ్చు. కాని, దైవానుగ్రహము లేకపోతే వారి ప్రామిస్‌లన్నీ మిస్సైపోతాయి. ఒక్క దైవము తప్ప మృత్యువును అడ్డుకోగలవాడు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. దైవానుగ్రహమున్నప్పుడు ఎలాంటి శక్తినైనా మనము సాధించవచ్చును.

విద్యార్థులారా! చిన్నవయస్సునుండియే మీరు ఈశ్వరానుగ్రహమునకు పాత్రులు కావడానికి కృషి చేయాలి. ప్రారంభమునుండి భగవంతుని ప్రార్థిస్తూ ఉంటే మీరు తప్పక రక్షింపబడతారు. ఒక్క దైవబలము తప్ప అన్యబలములేవీ పనికిరావు. దైవసంకల్పము మనకు తోడైనప్పుడు దేనినైనా మనం సాధించవచ్చును.

**శివమున్నచోట శవమునకు చోటులేదు**

ప్రేమస్వరూపులారా! ఈనాడు శివరాత్రి. 'శివము' అనగా మంగళకరమైనది అని అర్థం. అట్టి శివమున్న చోట శవమునకు చోటులేదు. కాబట్టి, తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండునంతవరకు నిరంతరం శివనామము మీ నాలుకపై నాట్యమాడుతూ ఉండాలి. మృత్యువును జయించినవాడు కాబట్టి, ఈశ్వరునికి 'మృత్యుంజయుడ'ని పేరు. తన కంఠములో విషమును నిల్పుకొన్నవాడు కాబట్టి, అతనికి 'నీలకంఠుడ'ని పేరు. చింతలు లేనివాడు కనుక అతనికి 'అచింత్యుడు' అని పేరు. ఎటువంటి ప్రమాణాలకూ చిక్కనివాడు కాబట్టి అతనికి 'అప్రమేయుడ'ని పేరు. భగవంతుని నామములు అనేక అంతరార్థములతో కూడివుంటాయి.

ఒకానొక సమయమున పార్వతీ పరమేశ్వరుల మధ్య వారి కుమారునికి పేరు పెట్టే విషయములో కొంత అభిప్రాయభేదము తలెత్తింది. పరమేశ్వరునికి గల అనంతమైన నామములలో ఒక పేరును తమ కుమారునికి పెట్టాలని ఆశించింది పార్వతి. "స్వామీ! నీవు సర్వశక్తిసంపన్నుడవు; సమస్త ప్రాణులకూ నాథుడవు. నీకున్న పేర్లలో ఏ ఒక్క పేరైనా నీవు చెప్పలేవా? ఆ పేరును ఈ పిల్లవానికి పెడతాను", అన్నది. అప్పుడు ఈశ్వరుడు ఆ పిల్లవానికి 'అమృత పుత్రుడు' అని పేరు పెట్టమన్నాడు. ఒకరోజున పార్వతి తన పుత్రుని ఊయలలో పెట్టి ఊపుతూ, 'నిదురపో నాయనా, నిదురపోవయ్య... నీవు మేల్కొని ఉంటే ప్రపంచమే మేల్కొని వుంటుంది..' అని జోలపాట పాడుతున్నది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన లక్ష్మీ దేవి, 'నీ బిడ్డ పేరు ఏమిటమ్మా?' అని అడిగింది. అప్పుడు పార్వతి, 'అమృతపుత్రుడు' అని చెప్పింది. 'ఏమిటి, అమృతపుత్రుడా? ఎక్కడినుండి వచ్చిందీ పేరు?' అని ఆమె అడుగగా, 'ఈశ్వరుడే పెట్టాడమ్మా!' అని చెప్పింది పార్వతి. ఈశ్వరుడు అమృతస్వరూపుడు. అట్టి ఈశ్వరత్వమునుండి యేర్పడిన ప్రతి జీవికూడా ఈశ్వరస్వరూపమే అవుతుంది. ప్రతి మానవుడు అమృతపుత్రుడేగాని, అనృతపుత్రుడు కాదు. కనుకనే, వేదము, 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః" అన్నది. అనృతపుత్రునికి మార్పున్నది, మరణమున్నది. కాని, అమృతపుత్రునికి మార్పూ లేదు, మరణమూ లేదు.

విద్యార్థులారా! మన భారతదేశములో పెద్దలు పిల్లలకు పెట్టే పేర్లు ఎంతో పవిత్రమైనవి. మీరందరూ వాటి అంతరార్థాన్ని గుర్తించి వర్తించడానికి ప్రయత్నం చేయండి. ఈశ్వరుని 'కైలాసవాసి' అంటారు. కైలాసము ఎక్కడున్నది? గాఢమైన నిశ్శబ్దములోనే కైలాసము కనబడుతుంది. కాబట్టి, మీరు మౌనము పాటించాలి. ఏవిధమైన మౌనము? కేవలం మాట్లాడడం మానివేస్తే లాభం లేదు; సంకల్పాలనుకూడా అరికట్టుకోవాలి.

**అమృతపుత్రులుగా జీవించండి**

ప్రేమస్వరూపులారా! మీరు ప్రాచీన గ్రంథములను యేమాత్రం చదవడం లేదు. వాటిని చదివినప్పుడే ఈనాడు నేను చెప్పే విషయాలు మీకు అర్థమవుతాయి. మీరందరూ అమృతపుత్రులు. ఆ పేరుకు తగినట్లుగా మిమ్మల్ని

మీరు తీర్చిదిద్దుకోవాలి. కాని, అమృతత్వ మంటే ఏమిటో మీకు అర్థం కావడం లేదు. అమృత పుత్రుడైనవానికి మృత్యువు లేదు. మీరందరూ అమృత పుత్రులుగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. పేర్లు పెట్టుకోవడం తమాషాకోసం కాదు; శాశ్వతంగా నిలిచి పోయేలా పెట్టుకోవాలి. పేర్లలో ఉన్న పవిత్రతను గుర్తించుకోవడానికి మన ప్రాచీనగ్రంథాలను చదవాలి. ఇటువంటి సత్యనిత్యమైన పవిత్రతను గుర్తించుకోలేక తప్పుమార్గంలో పడి మీ వాక్కుద్వారా, మీ చేతలద్వారా మీ శక్తిని మీరే క్షీణింపజేసుకుంటున్నారు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస అని మీరు నోటితో పలుకుతున్నారు కాని, ఆ పలికే పలుకులకు మీ హృదయాన్ని అర్పితం చేయడం లేదు. ప్రతి మానవుడు కూడా అమృతపుత్రుడేగాని, అనృతపుత్రుడు కాదు. అనృతత్వాన్ని మీకు మీరే కల్పించుకుంటున్నారు.

ప్రేమస్వరూపులారా! మీరంతా అమృతపుత్రులే! అమృతపుత్రులైన మీకు మృత్యువు రావడానికి కారణం ఏమిటి? మీరు మృత్యువును స్మరిస్తున్నారు. 'మేము అనృతపుత్రులమ'ని మీరు భావిస్తున్నారు. అదే పెద్ద దోషము. మీరు మృత్యువు నేమాత్రం తలంచకూడదు; 'మేము అనృతపుత్రులమ'ని భావించకూడదు. మీ పేరుకు ముందు 'అమృతపుత్రుడ'ని చేర్చుకోండి. 'మేము అమృతపుత్రులమ'ని గట్టిగా విశ్వసించండి. అప్పుడే మీరు మీ నిజతత్త్వాన్ని గ్రహించగలరు.

(2005 మార్చి 8వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)